రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనులకు అనుమతివ్వండి

● ప్రధాని మోదీకి సీఎం స్టాలిన్ లేఖ



చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపడుతున్న రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనులకు వీలైనంత త్వరగా అనుమతి జారీ చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రధానికి ఓ లేఖ రాశారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రస్తుతం మూడు మార్గాల్లో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఈ ప్రాజెక్టు పనులకు కేంద్రప్రభుత్వం అనుమతిని జారీ చేయడంలో విపరీతమైన జాప్యం ప్రదర్శించడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో నిధుల కేటాయింపులతో మొదటి దశ మెట్రోరైలు ప్రాజెక్టు పూర్తయ్యిందని, ఆ కోవలోనే రూ.63,246 కోట్లతో 119 కి.మీ.ల మూడు మార్గాల్లో మెట్రో రైలు ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి జారీ చేసిందన్నారు. 2019 జనవరిలో ఆ ప్రాజెక్టుకు అనుమతిని జారీ చేయాలని కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, ఇప్పటి వరకూ రాలేదన్నారు. కేంద్ర గృహవసతి నగరశివారు అభివృద్ధి శాఖల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్ ప్రతిపాదనల మేరకు జపాన్ సహకార సంస్థ, ఆసియా అభివృద్ధి బ్యాంక్, ఆసియా అంతర్గత నిర్మాణ పెట్టుబడుల బ్యాంక్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల జారీ ఒప్పందాలు ఖరారయ్యాయని, ఆ వివరాలతో సమగ్రమైన నివేదికను సమర్పించామన్నారు. 2020 నవంబర్ 21న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని, ఆ తర్వాత 2021-22 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటన జారీ అయ్యిందన్నారు. 2021 ఆగస్టు 17న ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ పథకంగా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ద్వారా ప్రకటించినప్పటికీ అధికారిక అనుమతి జారీ చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ విషయమై ప్రధాని మోదీని తాను కలుసుకున్న ప్రతిసారీ అనుమతి జారీకి విజ్ఞప్తి చేశానన్నారు. రెండేళ్లకు పైగా అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోందని, ఇకనైనా ప్రధాని మోదీ తగు చర్యలు తీసుకుని ఈ ప్రాజెక్టుకు అనుమతిని ప్రకటించాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి శాఖాపరమైన అనుమతి జాప్యం కావడం వల్ల చురుగ్గా సాగుతున్న రెండో దశ పనులు నత్తనకడన కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా జాప్యం చేయకుండా అనుమతి జారీ చేయాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

డీఎంకే కూటమిలో సీట్ల కోసం డిమాండ్

● అధిక స్థానాలు ఆశిస్తున్న పార్టీలు ● తమ గుర్తుపై పోటీ చేయించాలని అధికార పార్టీ వ్యూహం!



చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకే కూటమిలో మిత్రపక్షాల నుంచి సీట్ల కోసం డిమాండ్ పెరుగుతోంది. గతం కంటే తమకు మరిన్ని స్థానాలు కేటాయించాలంటూ పలు పార్టీలు ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ మిత్రపక్షనేతలను సముదాయించడంలో తలమునకలై వుంటున్నారు. డీఎంకే ఆధ్వర్యంలో సీట్ల సర్దుబాటు కమిటీ ఏర్పాటుచేసి, పలు పార్టీలతో చర్చలు జరపగా, మరికొన్ని పార్టీలతో మరో రెండు రోజుల్లో చర్చలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. 2019లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 స్థానాల్లో డీఎంకే 20, కాంగ్రెస్ 10, సీపీఎం, సీపీఐ, డీపీఐ తలా 2, ఎండీఎంకే, కేఎండీకే, ఐయూఎంఎల్, ఐజేకే తలా ఒక్కో స్థానంలో పోటీచేశాయి. అందులో గణేశమూర్తి (ఎండీఎంకే), సిన్‌రాజ్ (కేఎండీకే), రవికుమార్ (డీపీఐ), పచ్చముత్తు (ఐజేకే) తదితర నలుగురు డీఎంకే చిహ్నమైన 'ఉదయించే సూర్యుడు'పై పోటీ చేశారు. ఈ క్రమంలో, 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఇదే కూటమి బరిలో దిగనుండగా, అందు లో ఐజేకే ప్రస్తుతం కూటమిలో లేదు. అందుకు బదులుగా కమలహాసన్ నేతృత్వంలోని 'మక్కల్ నీది మయ్యం' కూటమిలో చేరే అవకాశముంది. అదే సమయంలో, సీట్ల సర్దుబాటుకు సంబంధించి డీఎంకే ఆధ్వర్యంలో పార్టీ కోశాధికారి టీఆర్ బాలు నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ కూటమి పార్టీలతో తొలివిడత చర్చలు ముగించింది. కాంగ్రెస్, డీపీఐ, ఐయూఎంఎల్‌తో ఈ కమిటీ భేటీ కావాల్సి వుంది. ఇదిలా వుండగా ఈ సారి తమకు మరిన్ని స్థానాలు కావాలంటూ పలు పార్టీలు డీఎంకేను డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఆ పార్టీ డైలమాలో పడినట్లు తెలిసింది. ఇందుకు మధ్యేమార్గంగా ఓ సలహా ఇస్తోంది. తమ మిత్రపక్షాలు అడిగే స్థానాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తూనే.. ఆయా పార్టీలు తమ చిహ్నంపై పోటీ చేసేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో గతంలో కూటమి పార్టీలకు కేటాయించిన సీట్లలో ఈసారి తమ పార్టీయే పోటీ చేయాలని కిందిస్థాయి కార్యకర్తలు సీట్ల సర్దుబాటు కమిటీకి విజ్ఞప్తి చేశారు. వీటన్నింటి నేపథ్యంలో ఈ సారి ఎన్నికల్లో 'ఉదయించే సూర్యుడు' గుర్తుపై విజయం సాధించే ఎంపీల సంఖ్య అధికంగా ఉండాలని డీఎంకే అధిష్ఠానం భావిస్తోంది. ఆ ప్రకారం, గరిష్ఠంగా 24 స్థానాల్లో నేరుగా పోటీచేయాలని ఆ పార్టీ భావిస్తోంది. మిగిలిన సీట్లలో కాంగ్రెస్‌కు పుదుచ్చేరి, 6 స్థానాలు, ఎండీఎంకేకు ఒక పార్లమెంటు, ఒక రాజ్యసభ, సీపీఎంకు 2, సీపీఐకి 1 పార్లమెంటు, 1 రాజ్యసభ, డీపీఐకు 2, కేఎండీకేకు 1, మక్కల్ నీది మయ్యంకు 1, ఐయూఎంఎల్‌కు 1 సీటు కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం.

అదనపు స్థానాలు...

ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఎం, సీపీఐ పార్టీలు అదనంగా మరో సీట్లు కేటాయించాలని కోరుతున్నాయి. ఇవి మినహా మక్కల్ నీది మయ్యం 3 కోరుతున్నట్లు తెలుస్తోంది. అలాగే, డీఎంకే కూటమిలో ఉన్న మనిదనేయ మక్కల్ కట్చి ఒక స్థానం కోరుతోంది. ఈ పరిస్థితుల్లో డీఎంకే నేరుగా పోటీచేసే 24 స్థానాలు మినహా, అదనంగా 4 నుంచి 5 స్థానాల్లో 'ఉదయించే సూర్యుడు' గుర్తుపై కూటమి పార్టీలు పోటీ చేసేలా వ్యూహరచన చేస్తోంది. కానీ, ఎండీఎంకే, డీపీఐ, మక్కల్ నీది మయ్యం తమ చిహ్నాలతోనే పోటీ చేస్తామని ప్రకటించాయి. అదే సమయంలో గతంలో పోటీ చేసిన స్థానాలు బదులుగా వేరే స్థానాల్లో పోటీచేసేందుకు కూటమి పార్టీలు సిద్ధపడడం డీఎంకే అధిష్ఠానాన్ని ఆలోచనలో పడేసింది. ఈ విషయమై డీఎంకే సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ... సీట్ల సర్దుబాటుపై ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుంటారన్నారు. 'ఇండియా' కూటమి గెలుపు కోసం కేటాయించే స్థానాలతో కూటమి పార్టీలు తృప్తి చెందే అవకాశముందని, ఈ నెల 20వ తేదీలోపు సీట్లు సర్దుబాటు కొలిక్కి వస్తుందని ఆయన తెలిపారు.

ప్లస్ టూ పరీక్షలకు రెండు రకాల ప్రశ్నపత్రాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: విద్యారంగంలో విప్లవాత్మక ప్రయోగాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. పరీక్షా విధానంలోనూ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలిగా ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో రెండు రకాల ప్రశ్నపత్రాలు వినియోగించాలని నిర్ణయించింది. తద్వారా విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు చేపట్టనుంది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేది నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. పరీక్షలకు సంబంధించిన నిబంధనలు, విధివిధానాల హ్యాండ్‌బుక్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. విద్యార్థులు కాపీయింగ్ పాల్పడకుండా నిరోధించేలా ఒక్కో పరీక్షా గదిలో రెండు రకాల ప్రశ్నపత్రాలు అందిస్తారు. అయితే రెండింటిలోనూ ప్రశ్నలు ఒకే రకంగా ఉంటాయని, వరుస క్రమం మాత్ర మే మారుతుందని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రంలో విద్యార్థులు, పర్యవేక్షకులు, ఉపాధ్యాయులకు సెల్‌ఫోన్ తీసుకెళ్లడంపై నిషేధించారు.

● కోవై కారు పేలుడు వ్యవహారం

చెన్నై, కోవై సహా 8 జిల్లాల్లో ఎన్‌ఐఏ సోదాలు

పెరంబూర్, ఫిబ్రవరి 10: చెన్నై, కోయంబత్తూర్, తిరునల్వేలి, మదురై సహా 8 జిల్లాల్లోని 27 ప్రాంతాల్లో ఎన్‌ఐఏ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కోవై నగరంలో ఉక్కడం సహా 12 ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. కోయంబత్తూర్ కోటమేడు ఈశ్వరన్ ఆలయం ముందు 2022 అక్టోబరు 23న కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అదే ప్రాంతానికి చెందిన జమేషా ముబిన్ అనే యువకుడు మృతి చెందాడు. నిషేధిత ఐఎస్ తీవ్రవాద సంస్థ మద్దతుదారుడైన ముబిన్, తన అనుచరులతో కలసి దీపావళి ముందు రోజున రద్దీ ప్రాంతాల్లో పేలుళ్లకు పాల్పడాలని నిర్ణయించినట్లు విచారణలో తెలిసింది. అయితే అయన ఈ ఘటనలో మృతిచెందాడు.

ఎన్‌ఐఏ విచారణ...

కారు పేలుడు ఘటనను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) విచారిస్తోంది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్ట్ చేసింది. ముబిన్‌తో సంబంధాలున్న వారు, అతనితో చదివిన వారి ఇళ్లలో ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టి పలు కీలక సాక్ష్యాలు, దస్త్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు. కారు పేలుడు ఘటనకు ముందు ముబిన్, అతని అనుచరులు పలు ప్రాంతాల్లో సమావేశమయ్యారు. అలాగే, పేలుళ్ల కోసం అవసరమైన ఉపకరణాలు కొనుగోలుకు పలువురు నిధులు అందించినట్లు ఎన్‌ఐఏ విచారణలో తెలిసింది. వారు ఎవరు అని విచారిస్తున్న అధికారులు, వారిని అదుపులోకి తీసుకొనే చర్యలు చేపట్టారు.

తిరుచ్చిలో...

తిరుచ్చి భీంనగర్ కూని బజార్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ అష్రఫ్ అలీ ఇంట్లో శనివారం ఉదయం ముగ్గురు అధికారులతో కూడిన ఎన్‌ఐఏ బృందం తనిఖీలు చేపట్టింది. అనంతరం కీశరన్ రోడ్డులోని అతని దుకాణంలోను తనిఖీలు చేపట్టారు. కోవై పేలుళ్లకు సంబంధించి విచారించారు. అష్రఫ్ అలీ బంధువులు పాకిస్థాన్‌లో ఉన్నట్లు, కొందరు బంధువులు అక్కడికి తరచూ వెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసినట్లు సమాచారం. అధికారులకు భద్రతా కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.





తిరుచ్చి భీంనగర్‌లో అష్రఫ్ అలీ ఇంటి ముందు పోలీసుల భద్రత - కోవై అల్ అమీన్ కాలనీలో ఎన్‌ఐఏ అధికారులు తనిఖీ చేపట్టిన ఇల్లు

కోయంబత్తూర్‌లో...

ముబిన్ స్నేహితులు, అతనిలో అరబిక్ కళాశాలలో చదివిన వారు, నిషేధిత సంస్థల మద్దతుదారుల ఇళ్లలో శనివారం మరోసారి ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టారు. చెన్నై, కోవై, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, కడలూరు సహా 8 జిల్లాల్లో ఒకే సమయంలో అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కోవైలో మాత్రమే 12 ప్రాంతాల్లో తనిఖీలు జరిగాయి. ఉక్కడం అల్-అమీన్ కాలనీకి చెందిన ఏసీ మెకానిక్ హబీబ్‌రెహ్మాన్ ఇంట్లో ఉదయం 6 గంటలకు హఠాత్తుగా ప్రవేశించిన ఎన్‌ఐఏ అధికారులు... అంగుళం అంగుళం గాలించారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వారు బయటకు వెళ్లేందుకు, బయట వ్యక్తులను ఇంట్లోకి అనుమతించలేదు. ఇంట్లో ఉన్న వారి సెల్‌ఫోన్లు కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉక్కడం ఎన్‌ఎస్ గార్డెన్‌లో ఉన్న ఫైసల్‌కుమార్ ఇంట్లోను అధికారులు తనిఖీలు చేపటి, ఇంట్లో ఉన్న వారిని విచారించారు. పోతనూర్ నాజర్ అనే మెడికల్ రెప్రజెంటేటివ్ ఇల్లు, అరుళ్‌నగర్‌లో అబుదాగీర్ ఇల్లు, అర్పుతమ్ నగర్‌లో సలావుద్దీన్ ఇల్లు, కరుంబుకడై గ్రీన్ గార్డెన్‌లో అనీష్‌మహమ్మద్ ఇల్లు, ఆర్‌ఎస్‌పురంలో పాల్ కంపెనీ నిర్వాహకుడు కమీల్ ఇల్లు, కునియముత్తూర్ రాజ్‌నగర్‌లో సుధీర్ మహమ్మద్ ఇల్లు, సీరపాళయం మదుకరైలో మహమ్మద్ అలీ జిన్నా ఇల్లు సహా 12 ప్రాంతాల్లో ఎన్‌ఐఏ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో సమస్యలు తలెత్తకుండా స్థానిక పోలీసులు ఆయా ఇళ్లు, వీధుల్లో భద్రతా విధులు చేపట్టారు.

చెన్నైలో..

రాజధాని నగరంలోని ఐదు ప్రాంతాల్లో ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరువికనగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్లా బాషా ఇంట్లో ఉదయం 6 గంటలకు అధికారులు సోదాలు ప్రారంభించారు. అలాగే, పెరంబూర్, విల్లివాక్కం, పల్లావరం తదితర ప్రాంతాల్లో తనిఖీలు జరిగాయి. కడలూరు మంగళంపేటకు చెందిన మహమ్మద్ సులైమాన్, తిరునల్వేలి జిల్లా ఏర్వాడికి చెందిన అలీ మహమ్మద్ ఇళ్లలోను తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీల్లో ల్యాప్ టాప్, సెల్‌ఫోన్, పలు దస్తావేజులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దస్తావేజుల ఆధారంగా మళ్లీ వారిని విచారించే అవకాశముందని సమాచారం. కారు పేలుడు ఘటనకు సంబంధించి ఇప్పటికే మూడు సార్లు తనిఖీలు చేపట్టిన నేపథ్యంలో, నాల్గో సారి శనివారం ఎన్‌ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఒకే సమయంలో 8 జిల్లాల్లో ఎన్‌ఐఏ తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది.

అమరజీవికి ఏడు దశాబ్దాల సేవ

● రామకృష్ణ కుటుంబీకులకు రుణపడి ఉన్నాం ● సంస్మరణ సభలో వక్తలు

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్ర అవతరణ కోసం ఆత్మబలిదానం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను ఎలుగెత్తి చాటిచెబుతూ, ఆత్మార్పణ స్థలంలో భవనాన్ని నిర్మించి ఏడు దశాబ్దాల పాటు తెలుగు భాషకు, సంస్కృతికి నిర్విరామ సేవలందించిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి పూర్వ కార్యదర్శి వై.రామకృష్ణ కుటుంబానికి తెలుగువారంతా రుణపడి ఉన్నారని సంస్మరణ సభలో పాల్గొన్న వక్తలు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో మైలాపూరు లజ్‌లోని స్మారక భవనంలో శనివారం ఉదయం సంస్థ పూర్వ కార్యదర్శి వై. రామకృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా రామకృష్ణ మృతికి సంతాపసూచకంగా సభ్యులంతా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆ తర్వాత జనని కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ... రామకృష్ణ తెలుగు భాషాభివృద్ధి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యఅతిథి రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహనరావు మాట్లాడుతూ... అమరజీవి భవనం రామకృష్ణ భవనంలాంటిదని, ఆయన ఆత్మ ఇక్కడే సంచరిస్తూ ఉంటుందని చెప్పారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటానికి అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రధాన కారకులైతే, ఆయన ఆత్మార్పణ గావించన స్థలంలో ఏర్పాటైన భవనంలో తెలుగు భాషాభివృద్ధి కోసం వైయస్ శాస్త్రి, ఆయన కుమారుడు రామకృష్ణ ఏడు దశాబ్దాలకు పైగా సేవలందించి ధన్యజీవులయ్యారన్నారు. ప్రపంచంలోని తెలుగువారంతా రామకృష్ణ కుటుంబానికి రుణపడి ఉన్నామనడం అతిశయోక్తి కాదన్నారు. అమరజీవి భవనం నిర్వహణకు సంబంధించి సమస్యలు తలెత్తినప్పుడు మండలి బుద్ధప్రసాద్, తాను కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి భవన నిర్వాహక కమిటీని ఏర్పాటు చేసి, మేడిశెట్టి తిరుమలకుమార్‌ను అధ్యక్షుడిగా చేశామని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత అనిల్‌కుమార్ రెడ్డి భవన నిర్వాహక కమిటీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని చెప్పారు. తెలుగుభాష, తెలుగు సంస్కృతి శాశ్వతంగానే ఉంటాయని, తెలుగు భాషకోసం పాటుపడినవారి సేవలను సమాజం చాలా ఆలస్యంగానే గుర్తిస్తుందని, ఇందుకు మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు భారతరత్న అవార్డును ప్రకటించడమే చక్కటి ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.



రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

ఆయన ఆశయాలు నెరవేరుస్తాం...

కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ... రామకృష్ణ ఆశయాలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. తాను ఈ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఈ భవన నిర్వహణకు రామకృష్ణ ఎంత కష్టపడ్డారో తెలియవచ్చిందన్నారు. సుమారు 14 సంవత్సరాలపాటు తండ్రి మాటకు కట్టుబడి రామకృష్ణ విదేశీ ఉద్యోగానికి స్వస్తి చెప్పి అమరజీవి భవనానికి సేవలందించారని చెప్పారు. రామకృష్ణ కార్యదర్శిగా పదవిని చేపట్టిన తొలి పది సంవత్సరాలు అమరజీవి స్మారక సమితి కార్యక్రమాలు బాగా జరిగాయని, ఆ తర్వాత ప్రభుత్వం నిధులు రాక ఆయనే సొంత ఖర్చుతో నడుపుతూ వచ్చారన్నారు. ఇక తమ కమిటీ వచ్చాక తొలి సంవత్సరం నిధులిచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులను నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా వ్యయ ప్రయాసలకోర్చి ఈ భవనం మూతపడకుండా కాపాడగలుగుతున్నామన్నారు. అమరజీవి భవనం గ్రంథాలయంలోని పుస్తకాలను డిజిటల్ చేయాలని రామకృష్ణ ఆశపడ్డారని, ఆ దిశగా తాను చర్యలు చేపట్టినా ఆ ప్రయత్నం తాత్కాలికంగా ఆగిపోయిందన్నారు. వీలయినంత త్వరగా ఆ పుస్తకాలను డిజిటలైజేషన్ చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కమిటీ సభ్యులు, సినీ గేయ రచయిత భువనచంద్ర, నారాయణగుప్తా, ఆచార్య విస్తాలి శంకరరావు, డాక్టర్ ఏవీ శివకుమారి, ఆచార్య ఎల్బీ శంకరరావు, తెలుగు ప్రముఖులు టీఆర్ఎస్ శర్మ, రెంటాల జయదేవ. తిరుమల ఆముక్తమాలత్యద తదితరులు కూడా ప్రసంగించారు.

త్వరలో మదురై ఎయిమ్స్ ఆసుపత్రి
నిర్మాణ పనులు ప్రారంభం

● పార్లమెంటులో కేంద్రమంత్రి భారతిప్రవీణ్ పవార్



ప్యారీస్, ఫిబ్రవరి 10: మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణపనులు త్వరలో ప్రారంభించనున్నట్లు పార్లమెంటులో కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ తెలిపారు. మదురై ఎయిమ్స్‌కు సంబంధించిన విరుదునగర్ కాంగ్రెస్ ఎంపీ మాణిక్యంఠాగూర్ శనివారం ఉదయం పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెబుతూ.. మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రికి అవసరమైన స్థలసేకరణ ప్రారంభంలోనే జాప్యం ఏర్పడిందని, అనంతరం ఆసుపత్రి భవన నిర్మాణ ఖర్చులు కూడా పెరిగాయని, దీనికి సంబంధించి బడ్జెట్‌ను కేంద్రప్రభుత్వం సవరించి అనుమతులు జారీచేసిందని తెలిపారు. ఇంతకు ముందు ఈ పథకానికి రూ.1,200 కోట్లు కేటాయించగా ప్రస్తుతం భవన నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల రూ.1,900 కోట్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆరు నెలల్లో దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రుల్లో ఖాళీయైన 29,000 పోస్టులు భర్తీ చేసేలా అర్హులైన సిబ్బందిని ఎంపిక చేసినట్లు మరో ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ వివరించారు.

సమాచార దర్శిని

నేడు 44 సబర్బన్ రైళ్ల రద్దు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: మరమ్మతుల కారణంగా ఆదివారం చెన్నై బీచ్ - చెంగల్పట్టు మార్గంలో 44 సబర్బన్ రైలు సేవలు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. కోడంబాక్కం - తాంబరం మధ్య ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఈ పనులు జరగనున్నాయి. ఈ కారణంగా చెన్నై బీచ్ నుంచి తాంబరం - చెంగల్పట్టు మధ్య ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు రెండు మార్గాల్లో సబర్బన్ రైళ్ల రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 3.30 తరువాత యథావిధిగా సర్వీసులు నడుస్తాయని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇకపై ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కుమరగురుపరన్ తెలిపారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో కొన్ని శిక్షణ కేంద్రాల్లో బోధనా విధానంపై టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందే వారు ఆహారం, బస సౌకర్యాల కోసం కేంద్రం నుంచి చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ఆయా పాఠశాలల్లో ఉన్న ఉన్నత సాంకేతిక ల్యాబ్‌లలో ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం 75 శాతం శిక్షణ ఆన్‌లైన్‌లోనే ఉంటుందని అధికారులు తెలిపారు.

సమాచార కమిషనర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: రాష్ట్ర సమాచార కమిషనరేట్‌లో ఖాళీగా ఉన్న రెండు పదవులకు అర్హులైన వారు ఈ నెల 29వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఔత్సాహికులు 'రిటైర్డ్ జడ్జి వాసుకి, సెలెక్షన్ కమిటీ అధ్యక్షురాలు, రెండవ అంతస్తు, క్యాథలిక్ సెంటర్, 108, అర్మేనియం వీధి, ప్యారీస్, చెన్నై-1' అనే చిరునామాకు స్పీడ్, రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు పంపించాలి. వివరాలకు kbkvasuki61@gmail.comలో చూడవచ్చు.

రూ.90 లక్షల స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: స్థానిక పాడిలో ఆలయానికి సొంతమైన రూ.90 లక్షల విలువైన స్థలాన్ని హిందూ దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాడి తిరువళ్లువర్ వీధిలో ఉన్న తిరువల్లీశ్వరర్ ఆలయానికి 2,025 చదరపు అడుగు స్థలం ఉంది. ఈ స్థలాన్ని గత 25 ఏళ్లుగా జగదాంబికై నగర్ సంఘానికి చెందిన వారు ఆక్రమించారు. అధికారుల నుంచి అనుమతి పొందకుండానే సొంత ప్రయోజనాలకు వినియోగిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న దేవాదాయ శాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలంలో ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకున్నారు.

13న విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: నగరంలో నాలుగు ప్రాంతాల్లో ఈ నెల 13వ తేదీ విద్యుత్ గ్రీవెన్స్ జరగనుంది. చింతాద్రిపేటలో ఉన్న అన్నాసాలై ఇంజనీర్ కార్యాలయం, అన్నానగర్ 11వ మెయిన్ రోడ్డులో ఉన్న ఇంజనీర్ కార్యాలయం, నంగనల్లూర్‌లో ఉన్న గిండి ఇంజనీర్ కార్యాలయం, వెంబాక్కంలో ఉన్న పొన్నేరి ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే శిబిరంలో వినియోగదారులు పాల్గొని, సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు పేర్కొంది.

రూ.30 కోట్లతో మాధవరంలో కాలువల నిర్మాణం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: స్థానిక మాధవరంలో వాన నీటి కాలువల నిర్మాణ పనులు రూ.30 కోట్లతో చేపట్టనున్నారు. ఇటీవల కురిసిన తుపానుకు రెడ్‌హిల్స్, పుళల్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండాయి. అదనపు జలాలను విడుదల చేయడంతో మాధవరంలో 10 రోజులకు పైగా నీరు ప్రవహించి జనజీవనాన్ని స్తంభింపజేసింది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా రూ.30 కోట్లతో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.1,260 కోట్ల ఆస్తి పన్ను వసూలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: చెన్నై కార్పొరేషన్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.1,260 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు అధికారులు తెలిపారు. నగరంలో 13.5 లక్షల ఆస్తుల యజమానులున్నారు. వారి నుంచి అర్ధవార్షికానికి రూ.850 కోట్లు పన్ను వసూలవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం గత ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.769 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఈ నేపథ్యంలో, రెండో అర్ధవార్షిక పన్ను అక్టోబరు నుంచి మార్చి 31వ తేది వరకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు సుమారు రూ.1,260 కోట్లు వసూలైందని, ఇంకా రూ.350 కోట్లు ఆస్తుల యజమానులు చెల్లించాల్సి ఉందన్నారు. గత ఏడాది రూ.1,500 కోట్ల ఆస్తి పన్ను వసూలైందని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

రూ.1.53 కోట్లతో గ్యాస్ దహనవాటిక

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: స్థానిక మాధవరం మండలం 32వ వార్డు పరిధిలోని సూరపట్టు వేలమ్మాళ్ నగర్ శ్మశానవాటికలో రూ.1.53 కోట్లతో గ్యాస్ దహనవాటిక నిర్మించనున్నారు. ఈ పనులనుగాను భూమి పూజ ఆ వార్డు కౌన్సిలర్ ఏలుమలై ఆధ్వర్యంలో జరగ్గా, మాధవరం మండల కమిటీ అధ్యక్షుడు నందగోపాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు.

అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: స్థానిక మనలిలో రూ.35 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని మండల అధ్యక్షుడు ప్రారంభించారు. 20వ వార్డు ఎంజీఆర్ నగర్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో 100 మందికి పైగా పిల్లలు చదువుతున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.35 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించారు. పనులు పూర్తికావడంతో శుక్రవారం భవన ప్రారంభోత్సవం జరిగింది.

14న అప్రెంటీస్‌షిప్ శిక్షణ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: అప్రెంటీస్‌షిప్ శిక్షణ ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక క్రోంపేటలో జరగనుందని మెట్రోపాలిటన్ రవాణా సంస్థ తెలిపింది. ఎంటీసీలో ఒక సంవత్సరం ఐటీఐ చదివిన వారికి మెకానిక్, మోటరు వాహన మెకానిక్ డీజిల్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ వంటి వాటిపై క్రోంపేటలో ఉన్న శిక్షణ కేంద్రంలో ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్నవారు శిక్షణ కేంద్రం అధికారిని నేరుగా సంప్రదించాలి.

రూ.1.69 కోట్లతో పాఠశాలకు అదనపు గదులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: స్థానిక రెడ్‌హిల్స్ సూరపట్టులో ఉన్న కార్పొరేషన్ పాఠశాలకు రూ.1.69 కోట్లతో అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మాధవరం మండలం పుళల్ సమీపంలోని సూరపట్టు కార్పొరేషన్ పాఠశాలలో 250 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఆరు బయట కూర్చుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు కార్పొరేషన్ అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ నిధులతో భవన నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

చాలినన్ని బస్సుల్లేక అవస్థలు

కీలంబాక్కంలో ప్రయాణికుల ధర్నా ● 3 గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీలంబాక్కం బస్‌టెర్మినల్ వద్ద శుక్రవారం రాత్రి చాలినన్ని బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఆ బస్ స్టేషన్‌లో రద్దీ పెరిగింది. అదే సమయంలో బస్సుల కొరతను ఖండిస్తూ ప్రయాణికులంతా ధర్నాకు దిగారు. దీంతో మూడు గంటలపాటు ఆ బస్‌టెర్మినల్ సమీపంలోని రహదారుల్లో రాకపోకలు స్తంభించాయి. ఆ బస్‌టెర్మినల్ వద్ద వారాంతపు సెలవు దినాల్లో దక్షిణాది జిల్లాలకు చాలినన్ని బస్సులు నడపడం లేదు. దీనికి తోడు ఆమ్నీ బస్సులను కీలంబాక్కం నుండే నడపాలంటూ ప్రభుత్వం ఆంక్షలు విధించి కోయంబేడులో సదరు బస్టాండును మూసివేసింది. దీంతో ఆమ్నీ బస్సులు ఏ ప్రాంతం నుంచి బయలుదేరుతాయో తెలియక ప్రయాణికులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో శని, ఆదివారాల్లో స్వస్థలాలకు బయలుదేరేందుకు నగరం నలుమూలల నుండి ప్రయాణికులు కీలంబాక్కం బస్‌టెర్మినల్‌కు చేరుకున్నారు. అప్పటికీ దక్షిణాది నగరాలకు వెళ్లే బస్సుల్లో టికెట్ రిజర్వేషన్లు పూర్తి కావటంతో ఆ బస్సులన్నీ బయలుదేరాయి. కానీ పిల్లాపాపలను వెంటబెట్టుకుని వెళ్ళిన ప్రయాణికులు తమ నగరాలకు వెళ్లే బస్సులు ఎంతసేపటికీ రాకపోవటంతో అధికారులతో గొడవపడ్డారు. ఆ తర్వాత ధర్నాకు దిగారు. బస్‌టెర్మినల్ ఎదురుగా ఉన్న తిరుచ్చి - చెన్నై రహదారిపై బైఠాయించారు. దీనితో ఆ మార్గంలో వెళుతున్న వాహనాలన్నీ ఎక్కడివక్కడే ఆగిపోయాయి. అదే సమయంలో పెరుంగళత్తూరు ప్రధాన రహదారిలో వందల సంఖ్యలో బస్సులు, కార్లు, తదితర వాహనాలు కూడా నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. శుక్రవారం అర్ధరాత్రి వరకూ ప్రయాణికులు ఆందోళన కొనసాగించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



కీలంబాక్కం బస్‌టెర్మినల్ వద్ద ధర్నా చేస్తున్న ప్రయాణికులతో చర్చలు జరుపుతున్న పోలీసులు

3 గంటలు ఆలస్యంగా షార్జా విమానం

అడయార్, ఫిబ్రవరి 10: సాంకేతిక లోపం కారణంగా షార్జా నుంచి చెన్నైకు రావాల్సిన విమానం మూడు గంటల ఆలస్యంగా చేరుకుంది. దీంతో ఆ విమానంలోని ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎయిర్ అరేబియాకు చెందిన విమానం శుక్రవారం రాత్రి 142 మంది ప్రయాణికులతో షార్జా నుంచి చెన్నైకు బయలుదేరింది. అయితే, ఈ విమానం నిర్ణీత సమయం కంటే మూడు గంటలు ఆలస్యంగా చెన్నైకు వచ్చింది. విమానం టేకాఫ్ అయిన తర్వాత సాంకేతిక సమస్య ఏర్పడినట్టు పైలెట్లు గుర్తించారు. దీంతో తిరిగి విమానాన్ని షార్జాకు మళ్ళించారు. షార్జా విమానాశ్రయంలో ఆ సమస్యను పరిష్కరించిన తర్వాత బయలుదేరి శనివారం వేకువజామున 3 గంటలకు వచ్చింది.

సివిల్ జడ్జిల ఇంటర్వ్యూపై స్టే

● టీఎన్‌పీఎస్సీ, సర్కారుకు కోర్టు నోటీసులు

అడయార్, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో సివిల్ జడ్జిల నియామకం కోసం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు ప్రభుత్వంతో పాటు టీఎన్‌పీఎస్సీ, మద్రాస్ హైకోర్టు ప్రధాన రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలో 245 సివిల్ జడ్జిల పోస్టుల భర్తీ కోసం గత ఏడాది జూన్‌లో టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ ఇలా మూడు దశల్లో ఈ పోస్టులను భర్తీ చేసేలా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆ ప్రకారంగా గత నవంబరులో ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి, ఇందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. అయితే, మెయిన్స్‌లో జవాబు పత్రాల మూల్యాంకనం సరిగా చేయలేదని, అందువల్ల ఇంటర్వ్యూలు నిర్వహించకుండా స్టే విధించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై న్యాయమూర్తులు ఆర్.మహాదేవన్, మహ్మద్ షఫిక్ ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపి, టీఎన్‌పీఎస్సీ, ప్రభుత్వం, మద్రాసు హైకోర్టు ప్రధాన రిజిస్ట్రార్‌లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది.

రేషన్ సరుకులు తరలించిన మినీలారీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ సరుకులు సహా వాహనం

ప్యారీస్, ఫిబ్రవరి 10: చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్ కోయిల్ సమీపంలోని హనుమంతపురం నుంచి చట్టవిరుద్ధంగా రేషన్ సరుకులు తరలించిన లారీని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హనుమంతపురం పంచాయతీ పరిధిలో ఉన్న రేషన్ దుకాణం వారంలో మూడు రోజులు మాత్రమే తెరచి ఉంటుందని, మిగతా రోజుల్లో ఈ దుకాణం పనిచేయదని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఆ రేషన్ దుకాణం ముందు నిలిపిన మినీ లారీలో కొందరు రేషన్ సరుకులు లోడ్ చేస్తున్నట్లు స్థానికులు పోలీసులకు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు అక్కడకు చేరుకొని లారీని స్వాధీనం చేసుకొని, ఘటనపై విచారిస్తున్నారు.

నర్సింగ్ విద్యార్థినికి వేధింపులు

● కాలేజీ నిర్వాహకుడి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 10: నర్సింగ్ కాలేజీలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినిని లైంగికంగా వేధించిన కేసులో కాలేజీ నిర్వాహకుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. నిందితుడిని వినోద్ కుమార్ (32)గా గుర్తించారు. ఈయన డిప్లొమా ఇన్ నర్సింగ్ పారామెడికల్ కాలేజీని నడుపుతూ వచ్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి ఈ చర్య చేపట్టారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు పారా మెడికల్ కాలేజీకి అధికారులు సీలు వేశారు.

ఓపీఎస్... హాస్య నటుడిగా మారిపోయారు

● జయకుమార్ సెటైర్లు

అడయార్, ఫిబ్రవరి 10: మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం సినిమాల్లో హాస్య నటుడిగా తరహా మారారని మాజీ మంత్రి, అన్నాడీఎంకే సీనియర్ నేత డి.జయకుమార్ ఎద్దేవా చేశారు. అన్నాడీఎంకే ఎన్నికల మేనిఫెస్టో కమిటీ శుక్రవారం మదురైలో సమావేశం నిర్వహించింది. ఇందులో మాజీ మంత్రులు సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయకుమార్ వంటి సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయకుమార్ విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రాల హక్కులను పరిరక్షించేది కేవలం ప్రాంతీయ పార్టీలేనని గతంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ప్రకటించారన్నారు. అదేవిధంగా తమ పార్టీ రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం ఏ ఒక్క జాతీయ పార్టీతో పొత్తు పెట్టుకోరాదని నిర్ణయించడమే కాకుండా, ఏ ఒక్క జాతీయ పార్టీకి మద్దతు ఇవ్వరాదని నిర్ణయించిందన్నారు.



అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం అవుతుండడంతో గవర్నర్ ప్రసంగం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ అప్పావు

టాయిలెట్ బేసిన్‌లో చిక్కుకున్న బాలుడి కాలు

పెరంబూర్, ఫిబ్రవరి 10: స్థానిక మైలాపూర్‌లో టాయిలెట్ బేసిన్ బాలుడి చిక్కుకున్న ఘటనలో అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా కాలును వెలికితీశారు. మైలాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని నివసిస్తున్న వినోద్, మూడున్నరేళ్ల కుమారుడు శుక్రవారం సాయంత్రం టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో బేసిన్‌లో కాలు చిక్కుకుంది. బాలుడి కేకలకు అక్కడకు చేరుకున్న తల్లిదండ్రులు బేసిన్ నుంచి కాలు వెలుపలికి తీసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో, తల్లిదండ్రుల సమాచారంతో మైలాపూర్ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని కాలు మెలికపడినట్లు గుర్తించారు. దీంతో, సిబ్బంది బాలుడితో మాట్లాడుతూ, సుమారు రెండు గంటలు శ్రమించి, పింగాణి బేసిన్ బద్దలుకొట్టి వెలికితీశారు.



బేసిన్ బద్దలుకొడుతున్న అగ్నిమాపక సిబ్బంది

మాజీ ఖైదీలకు నిత్యావసర సరుకుల పంపిణీ

వేలూరు, ఫిబ్రవరి 10: జైలు నుంచి విడుదలైన ఖైదీలకు తమిళనాడు మాజీ ఖైదీల సంక్షేమ సంఘం తరఫున బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నా 115వ జయంతి సందర్భంగా వేలూరు సెంట్రల్ జైలు నుంచి నలుగురు యావజ్జీవ ఖైదీలు, మహిళా సెంట్రల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన వీరికి మాజీ ఖైదీల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, న్యాయవాది విజయరాఘవులు నేతృత్వంలో వేలూరు జైలు సూపరింటెండెంట్ అబ్దుల్ రెహ్మాన్ బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ జనార్ధనన్, మహిళా జైలు అధికారి నీలామణి, పురుషుల జైలు అధికారి అరుళ్‌కుమరన్, జైలు సంక్షేమ అధికారి మోహన్, అసిస్టెంట్ జైలు అధికారి దురై తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న నిర్వాహకులు

ప్రైవేటు పాఠశాలలకు బెల్జియం దేశం నుంచి బాంబు బెదిరింపు?

పెరంబూర్, ఫిబ్రవరి 10: నగరంలోని 13 ప్రైవేటు పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపు బెల్జియం దేశ సర్వర్ నుంచి పంపినట్లు ఇంటర్‌పోల్ విచారణలో తెలిసినట్లు సమాచారం. గోపాలపురం, రాజా అన్నామలైపురం, అన్నానగర్ ప్రాంతాల్లోని 13 ప్రైవేటు పాఠశాలలకు గుర్తుతెలియని వ్యక్తులు ఈ-మెయిల్ ద్వారా గత గురువారం బాంబు బెదిరింపు పంపిన విషయం విదితమే. దీంతో, తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ్లి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై 13 పాఠశాలల యజమాన్యాలు అందజేసిన ఫిర్యాదులతో మూడు సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన సైబర్ క్రైం పోలీసులు, ఈ-మెయిల్ పంపిన ఆగంతకుల ఆచూకీ తెలుసుకొనేందుకు కేంద్ర నేర విభాగం పోలీసుల సాయం తీసుకున్నారు. ప్రోటాన్ అనే ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు, ఆ ఐపీ చిరునామా తెలుసుకోవడంలో సమస్యలు తలెత్తడంతో, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా స్విట్జర్లాండ్‌లో ఉన్న ఇంటర్‌పోల్ ప్రధాన కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో, బాంబు బెదిరింపుతో వచ్చిన అన్ని ఈ-మెయిల్ మెసేజ్‌లు బెల్జియం దేశ సర్వర్ నుంచి పంపినట్లు తెలిసింది. ఈ విషయమై ఇంటర్‌పోల్ ద్వారా స్విట్జర్లాండ్‌కు చెందిన ఓ ఐటీ సంస్థ భారత ఇంటెలిజెన్స్ విభాగానికి తెలియజేసింది. దీంతో, బెల్జియం దేశ ఐపీ చిరునామా, సర్వర్ తదితర వివరాలతో ఆ దేశాన్ని సంప్రదించి, ఈ సర్వర్ వివరాలు తెలుసుకోవాలని భావిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన వ్యక్తి బెల్జియం దేశం నుంచి ఈ పనులకు పాల్పడ్డాడా? వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) సాయంతో ఈ-మెయిల్ పంపారా? అనే కోణాల్లో సైబర్‌క్రైం విభాగం దర్యాప్తు చేపట్టింది.

నా భర్త ప్రాణాలకు ముప్పు

● రాష్ట్ర ప్రభుత్వానికి నళిని లేఖ

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి శ్రీలంక పునరావాస కేంద్రంలో ఉన్న తన భర్త మురుగన్ ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉందని, ఆయన్ను కాపాడాలంటూ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసు ముద్దాయి నళిని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు విడుదలైన రాజీవ్ హత్యకేసు ముద్దాయిలు మురుగన్, జయకుమార్, రాబర్ట్‌ఫయాజ్, శాంతన్... శ్రీలంక పౌరులుగా ఉండటంతో వారిని తిరుచ్చి సెంట్రల్ జైలు వద్దనున్న పునరావాస కేంద్రంలో బస కల్పించారు. తమను పునరావాస కేంద్రం నుంచి విడుదల చేయాలని కోరుతూ వీరంతా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. రెండు రోజులకు ముందు దీక్ష చేసిన రాబర్ట్ పయాజ్ తీవ్ర అస్వస్థతకు గురైనట్లు న్యాయవాది పుగళేంది తెలిపారు. ఈ పరిస్థితుల్లో తన భర్త మురుగన్ ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ నళిని పేర్కొంది. ఆ మేరకు ప్రభుత్వానికి లేఖ రాసింది.



నళిని, మురుగన్

పెరిగిన పూల ధరలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 10: స్థానిక కోయంబేడు మార్కెట్లో పూల ధరలు పెరిగాయి. శుభముహూర్తాలు, విశేష దినాలు లేకపోవడంతో గురువారం వరకు ధరలు తగ్గాయి. ఈ నేపథ్యంలో, శుక్రవారం అమావాస్య కావడంతో ధరలు పెరిగాయి. రూ.900 ఉన్న కిలో మల్లెపూలు రూ.1,200, రూ.800 ఉన్న ఐస్ మల్లెలు రూ.1,000, రూ.60 ఉన్న అడవి మల్లె రూ.360, రూ.300 ఉన్న జాజి పూలు రూ.1,000, రూ.300 ఉన్న కనకాంబరాలు రూ.1,000, రూ.70 ఉన్న గన్నేరు రూ.200, రూ.10 ఉన్న చామంతి రూ.80, రూ.15 ఉన్న సంపంగి రూ.100, రూ.20 ఉన్న పన్నీర్ రోజ్ రూ.100, రూ.30 ఉన్న చాక్లెట్ రోజ్ రూ.80కి విక్రయమయ్యాయి.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతి రిజర్వేషన్ కల్పించాలి

● జేఏసీ డిమాండ్

ప్యారీస్, ఫిబ్రవరి 10: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతి రిజర్వేషన్లు కల్పించి రాజ్యాంగాన్ని గౌరవించాలని ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ 16 (4)(ఎ)) తమిళనాడు విభాగం నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఈ కోరికను ఆమోదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వళ్లువర్‌కోట్టమ్ వద్ద శనివారం ఉదయం జేఏసీ ఆర్గనైజర్ కే కుమార్ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు మద్దతు డీపీఐ ఎంపీ తొల్ తిరుమావళవన్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎస్‌కే తమిళరసన్, అన్బువేందన్, జాన్ పాండ్యన్, మాజీ ఐఏఎస్ శివకామి, బీఎస్పీ ప్రధాన కార్యదర్శి ఎళిల్ మారన్ తదితరులు పాల్గొన్నారు.

వళ్లువర్‌కోట్టమ్ సమీపంలో ధర్నా చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు



మోదీ పాలనలోనే ఊహించని పురోగతి



తిరుచ్చి ప్రైవేటు కళాశాల రజతోత్సవాల సభలో ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లపాలనలోనే దేశం ఆర్థికంగా పురోగతి చెందిందని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నారు. తిరుచ్చిలో శనివారం ఉదయం జరిగిన ఓ ప్రైవేటు కళాశాల రజోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగిస్తూ ఈ కళాశాలను ఆశ్రమం ద్వారా నిర్వహించడం సముచితంగా ఉందన్నారు. విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ప్రధాని మోదీ దేశ ప్రజల అవసరాలన్నీ తీర్చేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. భారతదేశం పుణ్యభూమి అని, ఎంతో మంది జ్ఞానులు, రుషులు జన్మించిన భూమి కూడా ఇదేనని చెప్పారు. కరోనా మహమ్మారికి అన్ని దేశాలు భీతిల్లితే భారత దేశం వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచ దేశాలన్నింటికీ సరఫరా చేసిందన్నారు.

నల్లజెండాలతో లెఫ్ట్ పార్టీల నిరసన

అడయార్, ఫిబ్రవరి 10: ఒక కాలేజీ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి శనివారం తిరుచ్చికి వచ్చారు. ఆయన రాకకు వ్యతిరేకంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలు నల్లజెండాలతో నిరసన తెలిపారు. సీపీఎం తిరుచ్చి కార్పొరేషన్ విభాగం కార్యదర్శి రాజా సారథ్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఇందులో అనేక మంది కార్యకర్తలు, నేతలు పాల్గొని నల్లజెండాలతో నిరసన తెలుపుతూ, గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత పోలీసులు నిరసనకారులను చెదరగొట్టారు.

మోదీ పాలనకు చరమగీతం పాడాలి

● టీఎన్‌సీసీ చీఫ్ అళగిరి పిలుపు

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలికేలా ప్రభుత్వాన్ని నడుపుతున్న ప్రధాని మోదీకి దేశ ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ వెలువరించిన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెరవేర్చలేదని, ఆ తర్వాత కూడా అధికారంలోకి వచ్చినా ఎలాంటి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయలేదని, గత తొమ్మిదేళ్లుగా దేశ ఆర్థిక వ్యవస్థ పతనావస్థకు చేరుకుందన్నారు. బీజేపీ పాలకులు ఎన్నికల పత్రాల ద్వారా రూ.5272 కోట్ల మేరకు విరాళాలు సేకరించిందని, ఆ నిధులతోనే ఓట్లను కొనేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. మోదీ పాలనలో నిరుద్యోగ సమస్యతీవ్ర రూపం దాల్చిందని, కార్పొరేషన్ కంపెనీల యజమానులే లబ్ధి పొందుతున్నారని, సామాన్య ప్రజానీకం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని అళగిరి విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో మోదీ పాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు.

చెన్నైలో బీజేపీ ర్యాలీకి అనుమతి లేదు

ప్యారీస్, ఫిబ్రవరి 10: రాజధాని నగరం చెన్నైలో ఆదివారం నిర్వహించదలచిన బీజేపీ ర్యాలీకి పోలీసు శాఖ అనుమతి నిరాకరించింది. అయితే, మింట్ జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహించుకోవచ్చని పోలీసు కమిషనర్ కార్యాలయం తెలిపింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై 'ఎన్ మన్... ఎన్ మక్కల్' పేరుతో గత ఏడాది జూలై 28వ తేది పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్రను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రామనాథపురం జిల్లా రామేశ్వరంలో ప్రారంభించారు. ఈ పాదయాత్ర ఆదివారం చెన్నైకి చేరుకోనుంది. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయం ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి నిరాకరించింది. అంతేకాకుండా పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ చేపట్టిన ర్యాలీల్లో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకొని జేపీ నడ్డా పాల్గొననున్న ర్యాలీకి అనుమతించలేదని పోలీస్ కమిషనర్ కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వుల్లో తెలిపింది.

39 స్థానాల్లో బీజేపీ పోటీ: రామలింగం

రాష్ట్రంలోని 39 పార్లమెంటు స్థానాల్లో 'కమలం' గుర్తుతో పోటీ చేయాలంటూ బీజేపీ కార్యకర్తలు కోరుకుంటున్నారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ కేపీ రామలింగం తెలిపారు. నామక్కల్‌లో శనివారం ఉదయం పార్టీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల తరువాత రాష్ట్రంలో అధికార మార్పిడి ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యానికి తమిళులు దారి చూపించారని, ఇందుకు నిదర్శనం చోళుల కాలం నాటి శిలాఫలకాలేనని అన్నారు. పార్లమెంటు ఎన్నికల బరిలో నిలిచేది రెండు కూటములు మాత్రమేనని అన్నారు. ఈరోడ్ అసెంబ్లీ ఉపఎన్నికలో జరిగిన అవకతవకలను ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదని, అందువల్ల సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా ఉండేలా ఈసీ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కోయంబేడు నుంచి ఆమ్నీ బస్సు సేవలు

● హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

ప్యారీస్, ఫిబ్రవరి 10: స్థానిక కోయంబేడులోని ఆమ్నీ బస్ టెర్మినల్ నుంచి ప్రయాణికులు ఎక్కడం, దిగేందుకు అనుమతిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల నగర శివారు ప్రాంతమైన కీలంబాక్కంలో ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ బస్ టెర్మినల్ ప్రాంగణం నుంచే ఆమ్నీ బస్సులు ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు నడపాలని రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు న్యాయమూర్తి ఆర్ఎన్ మంజుల శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపారు. కోయంబేడు బస్ టెర్మినల్ సమీపంలో ఉన్న ఆమ్నీ బస్సుల సంస్థలకు చెందిన డిపోల నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడపవచ్చని, అదే విధంగా పోరూర్, సూరపట్టు టోల్ గేట్‌లలో కూడా ప్రయాణికులు ఎక్కడానికి, దిగడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. చెన్నై నుంచి దక్షిణాది జిల్లాలకు బయల్దేరే ఆమ్నీ బస్సులు కీ లంబాక్కం బస్ టెర్మినల్‌లో కూడా ప్రయాణికులను ఎక్కించుకోవచ్చని ఆదేశించిన న్యాయమూర్తి, ఈ కేసు తదుపరి విచారణ ఏప్రిల్ 15కు వాయిదావేశారు.

● హైకోర్టులో తమిళం అధికార భాష

న్యాయవాదుల నిరాహార దీక్షకు అనుమతి

ప్యారీస్, ఫిబ్రవరి 10: హైకోర్టులో తమిళాన్ని అధికార భాషగా అమలుపరచాలని కోరుతూ ఈనెల 28 నుంచి న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలకు అనుమతులు జారీ చేయాలంటూ పోలీసు శాఖకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మదురైకి చెందిన కె.భగవత్‌సింగ్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌లో... మద్రాసు హైకోర్టులో దాఖలయ్యే పిటిషన్ల విచారణ తమిళంలో సాగేలా ఉత్తర్వులు జారీ చేయాలన్న కోరిక రోజుల తరబడి అమలు జరగలేదని తెలిపారు. న్యాయవాదుల తరఫున చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెరీనా బీచ్ రోడ్డులోని తిరువళ్లువర్ విగ్రహం వద్ద నిరాహారదీక్ష చేపట్టేందుకు గత ఏడాది డిసెంబరు 20న అనుమతి కోరుతూ సమర్పించిన లేఖను పోలీసు శాఖ నిరాకరించిందని తెలిపారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి ఎస్.ఆనంద వెంకటేశ్ సమక్షంలో శుక్రవారం మళ్లీ విచారణకు రాగా, ప్రభుత్వ తరఫు న్యాయవాది హాజరై, శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు దృష్టిలో ఉంచుకొని పిటిషనర్‌కు అనుమతి నిరాకరించామని, అయితే ఎగ్మూర్ రాజరత్నినం స్టేడియం సమీపంలో దీక్షలు జరుపుకోవచ్చని తెలిపారు. ఇరుతరఫు వాదనల అనంతరం, ఎలాంటి చట్ట ఉల్లంఘన లేకుండా ఈ నెల 26 నుంచి రిలే నిరాహారదీక్ష జరిపేందుకు పిటిషనర్‌కు అనుమతులు జారీచేయాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేసి, తదుపరి విచారణ మార్చి 6 వ తేదీకి వాయిదావేసింది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న నవ వధువు మృతి!

అడయార్, ఫిబ్రవరి 10: తన మనసుకు నచ్చిన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఒక నవ వధువు, పెళ్లయిన 20 రోజులకే మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... వినాయకపురం, వేల్‌మురుగన్ నగర్‌కు చెందిన ఇందుజా (27) ఐటీ కంపెనీలో పనిచేస్తుంది. ఈమె గత ఐదేళ్లుగా పెరంబూరు ఎస్‌బీఐ కాలనీకి చెందిన హరిహరన్ (30)ను ప్రేమిస్తుంది. ఈ క్రమంలో వీరి వివారం గత నెల 21న జరిగింది. ఈ నేపథ్యంలో ఇందుజా శుక్రవారం అత్తగారి ఇంట్లో పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి ంది. ఆ వెంటనే ఆమెను భర్త స్థానిక కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి, ఆమె చనిపోయినట్టు నిర్ధారించారు. వివాహమైన 20 రోజుల్లోనే ఇందుజా చనిపోవడంతో ఆర్డీవో విచారణకు పోలీసులు సిఫార్సు చేశారు. అలాగే, మృతురాలి తల్లి ఆనంది తన కుమార్తె మృతిలో అనుమానం ఉందంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఓట్టేరి పోలీసులు విచారణ జరుపుతున్నారు.


సెమ్మొళి పార్కు ప్రవేశ ద్వారం


'టీ టైం' అంటున్న నమూనా


పూలు వాడకుండా నీరు పిచికారీ చేస్తున్న మహిళా ఉద్యోగి


పూలతో ప్రజలకు ఆహ్వానం పలుకుతున్న ఆర్చ్‌లు


పూల ఏనుగు వద్ద ఫొటో దిగుతున్న పోలీసు

పుష్ప సోయగం

● సెమ్మొళి పార్కులో పది రోజులు జరగనున్న ప్రదర్శన

ప్రారంభించిన మంత్రి...

సెమ్మొళి పార్కులో పుష్ప ప్రదర్శనను శనివారం ఉదయం యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పన్నీర్‌సెల్వం, ఎం.సుబ్రమణ్యం, ఎంపీ దయానిధి మారన్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన పిల్లలు, పెద్దలను విశేషంగా ఆకట్టుకుంటుందని ప్రదర్శన నిర్వాహకులు తెలియజేశారు.


తాబేలు నమూనాతో పూల అలంకరణ


ప్రదర్శన తిలకిస్తున్న మంత్రులు ఉదయనిధి, పన్నీర్‌సెల్వం, సుబ్రమణ్యం, ఎంపీ దయానిధి మారన్ తదితరులు - బాతుల నమూనా

కారు నమూనాలో వివిధ రంగుల్లో పుష్పాలు

పెరంబూర్, ఫిబ్రవరి 10: స్థానిక జెమిని ఫ్లై ఓవర్ సమీపంలో సెమ్మొళి పార్కు పుష్ప సోయగాలతో అలలారుతోంది. చెన్నైలో నిర్వహిస్తున్న ఈ పుష్ప ప్రదర్శన నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పది రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు ప్రవేశ రుసుముగా పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.75గా నిర్ణయించారు.

రెండేళ్లుగా...

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన ఊటీ, కొడైక్కెనాల్, ఏర్కాడు సహా పర్యాటక ప్రాంతాల్లో వేసవి సెలవుల్లో పుష్ప ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా దేశ, విదేశాల నుంచి తీసుకొచ్చే అరుదైన మొక్కలను డిసెంబరులో నాటి పర్యవేక్షిస్తుండగా, ఏప్రిల్‌లో పూలు పూసిన అనంతరం ఈ ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, చెన్నైలో తొలిసారిగా 2022లో పుష్ప ప్రదర్శన నిర్వహించగా, 2023లో కూడా జరిగింది. కానీ, ఈ రెండు ప్రదర్శనలు స్థానిక అన్నాసాలైలోని కలైంజర్ ఆ డి టో రియం ప్రాంగణంలో నిర్వహించగా, తొలి ప్రదర్శన రెండు రోజులు, రెండో ప్రదర్శన మూడు రోజులు జరిగాయి.

సెమ్మొళి పార్కులో...

తేనాంపేటలో 2018లో 8 ఎకరాల విస్తీర్ణంలో సెమ్మొళి పార్కు ఏర్పాటైంది. ఇక్కడ పలు రకాల పూల మొక్కలను సంరక్షిస్తున్నారు. అలాగే, ఏనుగు, నెమలి, వానరం సహా 18 రకాల డిజైన్లను పూలతో అలంకరించారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది పుష్ప ప్రదర్శన సెమ్మొళి పార్కులో నిర్వహించాలని నిర్ణయించిన రాష్ట్రప్రభుత్వం, వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు ఆ బాధ్యత అప్పగించింది. ఇందుకోసం ఊటీ, కొడైక్కెనాల్, మదురై, కన్నికుమారి సహా పలు జిల్లాల నుంచి వివిధ రకాల 12 లక్షలకు పైగా మొక్కలు తెప్పించి పార్కు అంతా అందంగా అలంకరించారు.

నవ్వించేందుకే సినిమాల్లో నటిస్తున్నా

● హీరో సంతానం

చిత్రజ్యోతి

తాను వివాదాలను సృష్టించడం కోసం సినిమాల్లో నటించడం లేదని, కేవలం ప్రేక్షకులను నవ్వించడం కోసమే నటిస్తున్నానని హీరో సంతానం అన్నారు. కార్తీక్ యోగి దర్శకత్వంలో సంతానం, మేఘాఆకాష్ జంటగా నిళల్‌గల్ రవి, ఎంఎస్ భాస్కర్, తమిళ్, మారన్, రాజేంద్రన్, జాన్‌విజయ్, రవిమారియా, కూల్ సురేష్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ఈనెల 2న విడుదలైన ఈ చిత్రం సూపర్‌డూపర్ హిట్ సాధించింది. దీన్ని పురస్కరించుకుని చెన్నైలో సక్సెస్ మీట్‌ను శనివారం చిత్ర బృందం నిర్వహించింది. ఇందులో హీరో సంతానం మాట్లాడుతూ... 'మీడియా ఇచ్చిన పాజిటివ్ రివ్యూలే ఈ చిత్ర ఘన విజయానికి కారణం. ప్రేక్షకులను నవ్వించడమే నా వృత్తి. ఈ సినిమా విడుదలకు ముందుకు టైటిల్‌లో వివాదం చెలరేగింది. విడుదలైన తర్వాత థియేటర్‌కు వెళ్లిన ప్రతి ప్రేక్షకుడు కడుపుబ్బ నవ్వుకున్నారు. నాకు దేవుడి భక్తి ఎక్కువ. ఎవరి నమ్మకాలు వారివి. మూఢ నమ్మకంతో పాటు దైవభక్తిని కలగలిపి ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించారు' అని అన్నారు. దర్శకుడు కార్తీక్ యోగి మాట్లాడుతూ... 'ఈ చిత్ర విజయానికి ప్రధాన కారణం మీడియానే. మీతో పాటు చిత్రాన్ని ఘన విజయం చేసిన ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు. ఈ సినిమా కోసం ఎంతో శ్రమించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. బడ్జెట్‌కు వెనుకాడకుండా, క్వాలిటీలో రాజీపడకుండా చిత్రాన్ని తెరకెక్కించిన నిర్మాతకు కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. సీనియర్ నటుడు ఎంఎస్.భాస్కర్ మాట్లాడుతూ... 'ఈ సినిమా కోసం హీరో సంతానం ఎంతగానో శ్రమించారు. ఆయన హార్డ్‌వర్క్‌కు దక్కిన ప్రతిఫలం. ఒక సినిమా విజయం ఎంతోమంది నటులకు లైఫ్ ఇస్తుంది. అలాంటిదే వడక్కుపట్టి రామస్వామి సక్సెస్' అని అన్నారు. హీరోయిన్ మేఘా ఆకాష్ మాట్లాడుతూ... 'ఈ సినిమా నాకు ఎంతో ముఖ్యం. షూటింగ్ సమయంలో ఎన్నో కష్టాలు ఎదురైనప్పటికీ.. ఈ ఘన విజయం అవన్నీ మరిచిపోయేలా చేసింది' అన్నారు. అలాగే, మిగిలిన చిత్ర బృంద సభ్యులు తదితరులు ప్రసంగించారు. కాగా, ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు.


'వడక్కుపట్టి రామస్వామి' సక్సెస్ మీట్

ఒంటరిగా ఉండడాన్నే ఇష్టపడతా

● హీరోయిన్ ఓవియ



వైవాహికం కంటే ఒంటరి జీవితాన్ని గడపడానికి ఇష్టపడతానని హీరోయిన్ ఓవియ చెప్పారు. తన పెళ్లి వార్తలపై ఆమె స్పందించారు. 'సమయం వచ్చినపుడు అది జరుగుతుంది. స్వతహాగా వస్తే ఓకే. లేకపోయినా ఫర్వాలేదు. నేను సంతోషంగా ఉన్నా. ఎవరివద్దా దేన్నీ ఆశించడం లేదు. సింగిల్‌గానే జీవిస్తున్నా. ఒంటరిగా జీవించడమే బాగా ఇష్టపడతా' అని వెల్లడించారు. కాగా, 'కలవాణి', 'ముత్తుక్కు ముత్తాగ', 'మెరీనా', 'మదయానై కూట్టం' తదితర చిత్రాల్లో నటించిన ఓవియా... 'బిగ్‌బాస్' తమిళ సీజన్-1లో పాల్గొని ఒక్కసారిగా ఫేమస్ అయ్యారు. ఆ తర్వాత సినిమా అవకాశాలు చేజిక్కించుకుంటూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.

ఆకాష్ మురళి - అదితి శంకర్ జంటగా కొత్త చిత్రం


ఆకాష్ మురళి - విష్ణువర్ధన్

యువ హీరో ఆకాష్ మురళి - అదితి శంకర్ జంటగా విష్ణువర్ధన్ దర్శకత్వంలో ఒక చిత్రం తెరకెక్కనుంది. ఎక్స్‌బీ ఫిల్మ్ క్రియేటర్స్ బ్యానరుపై నిర్మాత జేవియర్ బ్రిట్టో సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. పోర్చుగల్, స్పెయిన్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకోనుంది. అందమైన ప్రేమ కథతో దర్శకుడు విష్ణువర్ధన్ రూపొందిస్తున్నారు. ఇందులో శరత్‌కుమార్, ప్రభు గణేశన్, ఖుష్బూ, కల్కి కొచ్లిన్, షివ్ పండిట్, జార్జ్ కోరా వంటి ముఖ్య నటీనటులు నటించనున్నారు. బ్రిసన్ కెమెరామెన్‌గా పనిచేసే ఈ చిత్రానికి యువన్‌శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. 'అరిందుం అరియామలుం', 'పట్టియల్', 'బిల్లా', 'ఆరంభం' వంటి చిత్రాలను తెరకెక్కించి విజయాన్ని సొంతం చేసుకున్న విష్ణువర్ధన్... ఆ తర్వాత బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం సల్మాన్‌ఖాన్‌తో కలిసి పనిచేస్తున్నారు. ఇపుడు రొమాంటిక్ ఎంటర్‌టైనర్ రూపొందించేందుకు మళ్లీ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తు

ప్లీజ్.. పాలిటిక్స్‌పై ప్రశ్నలు వద్దు

● రజనీకాంత్



తన వద్ద రాజకీయాలకు సంబంధించిన ప్రశ్నలు అడగొద్దని మీడియాకు సూపర్‌స్టార్ రజనీకాంత్ కోరారు. ఆయన శనివారం చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 'ప్లీజ్... పాలిటిక్స్ గురించి ప్రశ్నలు వేయొద్దు. 'లాల్‌సలాం' చిత్రం ఘన విజయం సాధించడం సంతోషంగా ఉంది. తన పాత్రతో పాటు చిత్రంలోని మిగిలిన కథా పాత్రలు బాగున్నాయంటూ ప్రశంసిస్తున్నారు. ఇది చాలా సంతోషం కలిగించే వార్త. ఇకపోతే, 'వేట్టయ్యన్' చిత్రం 80 శాతం మేరకు చిత్రీకరణ పూర్తయింది' అంటూ వ్యాఖ్యానించారు. తన సినిమా షూటింగుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చే సమయంలో ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నారు. ఈ కోవలోనే తాజాగా ఆయన శనివారం స్పందించారు.

దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప

● టీఐఎఫ్ ఎండీ రాఘవన్


తండయార్‌పేట కేంద్రంలో అన్నదానం చేస్తున్న రాఘవన్, జవేరి తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 10: దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని, ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని టాబ్లెట్స్ ఇండియా ఫౌండేషన్ (టీఐఎఫ్) నిర్వహించడం సంతోషకరమైన విషయమని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ఎస్ రాఘవన్ పేర్కొన్నారు. టీఐఎఫ్ నిర్వహణలోని సీఎస్సార్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చెన్నై, మహాబలిపురం, పుదుచ్చేరిలల్లో ఐదు అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటిలో తయారుచేసే ఆహారాన్ని నెలకు సుమారు 40,000 మందికి గత ఐదేళ్లుగా దానం చేస్తున్నారు. అదే విధంగా ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల సమీపంలో నివసిస్తున్న అభాగ్యులకు ఉచిత వైద్యచికిత్సలు అందిస్తున్నారు. స్థానిక తండయార్‌పేటలో టీఐఎఫ్ సీఎస్సార్ పంచమ వార్షికోత్సవం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. ఛైర్మన్ ఆర్కే జావేర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భారత్ జవేరి, ఆర్ఎస్ రాఘవన్ హాజరైన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కూసు ఎకనామికల్ ఫెడరేషన్ సంస్థ ఛైర్మన్ యుటాకోఅసో పాల్గొన్నారు. కాగా, 10 లక్షల మందికి అన్నదానం చేసి రికార్డు నెలకొల్పిన టీఐఎఫ్‌కు అవార్డు అందజేసి అభినందించారు.

రూ.1.70 కోట్ల రెండు చేతి గడియారాల స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న ఖరీదైన చేతి గడియారాలు

పెరంబూర్, ఫిబ్రవరి 10: మీనంబాక్కం లోని విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి నుంచి రెండు ఖరీదైన చేతి గడియారాలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు అందిన సమాచారం మేరకు, హాంకాంగ్ నుంచి సింగపూర్ మీదుగా చెన్నైకి వచ్చిన విమాన ప్రయాణికులను అధికారులు తనిఖీ చేశారు. వారిలో ఒకరు పొంతన లేని సమాధానాలివ్వడంతో, అతడి లగేజీ పరిశీలించగా, రూ.1.7 కోట్ల విలువైన బేటిక్ ఫిలిప్స్ 5740, పెర్కేట్ 2759 అనే ఖరీదైన చేతి గడియారాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద చేపట్టిన విచారణలో, సింగపూర్‌లో ఓ వ్యక్తి ఈ ప్యాకెట్ అందించి చెన్నైలో తన స్నేహితులకు అందిస్తే డబ్బులిస్తారని తెలిపినట్లు పేర్కొన్నాడు. విదేశీల నుంచి అక్రమంగా ఖరీదైన వస్తువులు తరలించే ఏజెంట్ అని నిర్ధారించిన అధికారులు, ఈ తరలింపు వెనుక ఎవరెవరున్నారు అని విచారణ చేపట్టారు.

యువ గాయకులను ప్రోత్సహించేలా అవార్డులు



అవార్డు గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఫిబ్రవరి 10: యువగాయకులను ప్రోత్సహించేలా ప్రతి ఏడాది అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై కర్ణాటిక్ ఆధ్వర్యంలో టి.నగర్‌లోని వాణి మహల్‌లో శుక్రవారం రాత్రి 'తి తాలిర్‌కాల అవార్డ్స్ 2024' పేరిట కర్ణాటక సంగీత పోటీలు నిర్వహించారు. 8 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపున్న బాలబాలికలకు సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 63 మంది పాల్గొన్నారు. ఈ విభాగాల్లో గెలుపొందిన నలుగురు, ప్రతిభ చూపిన 10 మందికి రోటరీ ఛైర్మన్ రొటేరియన్ ఆర్.చంద్రమౌళి సేతురామన్, అధ్యక్షుడు రొటేరియన్ జిగర్ సాల్వా అవార్డులు ప్రదానం చేసి అభినందించారు.

ఆ చిల్లర నేతల వ్యాఖ్యలు పట్టించుకోను

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



ప్యారీస్, ఫిబ్రవరి 10: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన పొత్తులపై అన్నాడీఎంకేకు చెందిన చిల్లర నేతల వ్యాఖ్యలు పట్టించుకోబోనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యానించారు. ఆయన చేపట్టిన 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పాదయాత్ర శనివారం ఉదయం తిరువళ్లూర్‌కు చేరుకోగా, పార్టీ జిల్లా నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే మాజీ మంత్రి ఉదయకుమార్ తనపై చేసిన విమర్శలపై స్పందించబోనని, ఆయన చిల్లర నేత అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ తమిళ భాషను గౌరవిస్తూ, ఏ దేశానికి వెళ్లినా ఆ భాషకు ఘనత చేకూరుస్తున్నారని, అంతేకాకుండా రాష్ట్రానికి అన్ని వసతులు సమకూరుస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం పంపిణీ చేసిన రూ.1,330 కోట్లను కరువు బాధితులకు పంపిణీ చేయవచ్చని అయితే, డీఎంకే ప్రభుత్వం ఆ నిధులను ఖర్చుచేయకుండా పక్కన పెట్టిందని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో తమిళనాట ఒంటరిగా బీజేపీ పోటీచేస్తే 21 శాతానికి పైగా ఓట్లు రాబట్టుకోవచ్చని టైమ్స్ ఆఫ్ ఇండియా సర్వేలో వెల్లడైందని, తాజాగా ఇండియా టుడే సీ ఓటరు సర్వేలో 16 శాతం ఓట్లు వస్తాయని తెలిపిందని, దీన్ని బట్టి కమలం గుర్తుకు రోజురోజుకు ప్రజల మద్దతు పెరుగుతోందని అన్నామలై అన్నారు.

వీఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో "విపాస్-2024"



అడయార్, ఫిబ్రవరి 10: నగరంలోని వీఎస్ హాస్పిటల్, వీఎస్ మెడికల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక 'వీఎస్ ఇంటర్నేషనల్ ప్రీసిసన్ ఆంకాలజీ సమ్మిట్-2024' (విపాస్-2024)ను నిర్వహించారు. స్థానిక గిండీలోని ఒక నక్షత్ర హోటల్‌లో జరిగిన ఈ సదస్సుల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత ఆంకాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా సాగుతున్న వైద్య పోరాటంలో సహకారం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ విపాస్-2024 క్యాన్సర్ స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్స్, ప్రోగ్నోస్టిక్స్, థెరప్యూటిక్స్ సమగ్ర సంరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ, క్యాన్సర్ చికిత్సలో పరివర్తనాత్మక పురోగతిని ఉత్ప్రేరకపరచడం లక్ష్యంగా సాగినట్టు వారు వివరించారు. ఇందులో 100 మంది వరకు ఫ్యాకల్టీ, 200కుపైగా ప్రముఖ క్యాన్సర్ సెంటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో లింఫోమాస్, ల్యుకేమియా, మైలోమాస్, హాడ్‌కిన్స్ డిసీజ్, ఎండీఎస్, బ్రెస్ట్, లంగ్స్, హెడ్ అండ్ నెక్ వంటి సాలిడ్ ట్యూమర్స్, ఇమ్యునోథెరపీ, లిక్విడ్ బయోప్సీ ఇలా అనేక అంశాలపై చర్చ జరిగినట్టు వీఎస్ గ్రూపు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ జన్మరక్ష హరినామ సంకీర్తనం

● శ్రీ వెంకటాద్రి భజన సమాజంలో ముగిసిన ఆధ్యాత్మిక కార్యక్రమం


పద్మావతి తాయారు సమేత శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, ఫిబ్రవరి 10: స్థానిక మాధవరం సమీపంలోని పొన్నియమ్మన్ మేడు మోహన్ నగర్ మొదటి వీధిలో ఉన్న శ్రీ వెంకటాద్రి భజన సమాజంలో ఈనెల 6 నుంచి నిర్వహించిన ఆధ్యాత్మిక ఉత్సవాలు శనివారం జన్మరక్ష హరినామ సంకీర్తనంతో ముగిశాయి. టీటీడీ, హిందు ధర్మ ప్రచార పరిషత్, టీటీడీ చెన్నై సలహా మండలి సహకారంతో ప్రారంభించిన ఆధ్యాత్మిక సంగీతం, భక్తి పాటలు, భజన తదితర ప్రత్యేక పూజల్లో సంగీత కళాకారులు, శ్రీవారి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు లోకకల్యాణార్థం నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలో ముత్తయిదులు పాల్గొని, అష్టోత్తరాలు, సహస్రనామ పారాయణంతో భక్తిని చాటుకున్నారు. కోరికలు తీరాలని అమ్మవారికి గాజులు, బెల్లం, పసుపుకుంకుమ, తాంబూలం, పట్టువస్త్రాలు, పండ్లు నైవేద్యంగా నివేదించారు. శనివారం సమాజం కళాకారులు శ్రీ జన్మరక్ష హరినామ సంకీర్తనను శ్రావ్యంగా ఆలపించారు. టీటీడీ సలహా మండలి సభ్యుడు గణేశ్, సమాజం అధ్యక్షుడు ధర్మరాజ్, ఉపాధ్యక్షుడు ఐశ్వర్య తదితరులు భక్తులందరికీ తీర్థ అన్నప్రసాదాలు వినియోగించారు.

33 నెలల్లో రూ.8.65 లక్షల కోట్ల పెట్టుబడుల సమీకరణ

● రాష్ట్రప్రభుత్వ ప్రకటన

పెరంబూర్, ఫిబ్రవరి 10: డీఎంకే అధికారం చేపట్టిన 33 నెలల కాలంలో రూ.8.65 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రప్రభుత్వం సేకరించినట్లు సచివాయం తెలిపింది. 'పెట్టుబడిదారుల తొలి చిరునామా తమిళనాడు' పేరుతో నిర్వహించిన మహానాడులో రూ.1.90 లక్షల కోట్లు పెట్టుబడులు సమీకరించినట్టు పేర్కొంది. ఈ పెట్టుబడులతో 2.80 లక్షల ఉపాధి పొందనున్నారని తెలిపింది. రెండో విడతగా, సింగపూర్, మలేసియా, జపాన్, అరబ్ దేశాల్లో ముఖ్యమంత్రి పర్యటించారని, ఆ సందర్భంగా రూ.7,441 కోట్ల పెట్టుబడులు సమీకరించారనింది. ఆ పెట్టుబడులతో 17,371 మందికి ఉపాది అవకాశాలు కల్పించవచ్చని పేర్కొంది. మూడో విడతగా గత నెల చెన్నైలో నిర్వహించిన పెట్టుబడిదారుల మహానాడులో రూ.6,64,180 కోట్ల పెట్టుబుడులపై ఒప్పందాలు జరిగాయన్నారు. వీటి ద్వారా 26,90,657 మంది ఉపాధి పొందనున్నారని తెలిపింది. నాల్గో విడతగా ముఖ్యమంత్రి స్పెయిన్‌లో పర్యటించి, రూ.3,440 కోట్ల మేరకు పెట్టుబడులపై ఒప్పందాలు కుదిరాయని తెలిపింది. మొత్తం రూ.8.65 లక్షల కోట్ల పెట్టుబడులతో 30 లక్షల మంది ఉద్యోగ అవకాశాలు పొందనున్నారని రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది.